

ప్రజా ఆశీర్వాద సభకు తరలివస్తున్న మహిళలు



వేదికపై నృత్యం చేస్తున్న కళాకారులు

# జమ్మికుంట గడ్డపై జన ప్రభంజనం

- హుజూరాబాద్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం
- నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజానీకం
- కిక్కిరిసిన ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానం

హుజూరాబాద్/ హుజూరాబాద్ టౌన్/ జమ్మికుంట/ హుజూరాబాద్ రూరల్/ ఇల్లందకుంట/ వీణవంక, నవంబర్ 17: జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభ జన సంద్రమైంది. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. పట్టణానికి నలువైపులున్న రహదారులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. పట్టణం మొత్తం సభకు వచ్చిన జనంతో గులాబీమయమైంది. డిగ్రీ కళాశాల మైదానంలో ఇసుకేస్తే రాలనంత జన సందోహమైంది. తమ అభిమాన నాయకుడి ప్రసంగం వినేందుకు ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు, డీసీఎంలు, ద్విచక్ర వాహనాలపై స్వచ్ఛందంగా తరలివచ్చారు. మహిళలు, వృద్ధులు, యువకులు పెద్ద ఎత్తున జెండాలు చేతబూని 'జై తెలంగాణ.. జై కేసీఆర్.. జై కౌశికన్న' అంటూ నినాదాలు చేస్తూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సభికులకు బీఆర్ఎస్ వలంటీర్లు తాగేందుకు నీళ్ల ప్యాకెట్లను అందించారు. ప్రముఖ కళాకారుడు మిట్టపెల్లి సురేందర్ ఆధ్వర్యంలో కళాకారుల బృందం ఆట, పాటలు అలరించాయి. ముఖ్యంగా 'దేఖ్‌లేంగే.., రామక్క..' పాటలు ఉర్రూతలూగించాయి. కళాకారులతో పాటూ ప్రజలు కూడా నృత్యాలు చేశారు. ఈలలు, చప్పట్లతో సభా ప్రాంగణం మార్మోగింది. సభలో మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపల్ అధ్యక్షులు తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, గందె రాధిక, నాయకులు పాల్గొన్నారు.

వీణవంక మండల కేంద్రంతో పాటు మండలంలోని 26 గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా ప్రజా ఆశీర్వాద సభకు తరలివెళ్లారు. ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్ర వాహనాలు, ట్రాలీల్లో సుమారు 15 వేల మంది బయలుదేరగా, గ్రామాలు 'జై బీఆర్ఎస్' నినాదాలతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక–తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల–సాధవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత–శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రఘుపాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా, మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, వీరారెడ్డి, జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలకిషన్‌రావు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గంగాడి తిరుపతిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలతో పాటు తదితరులు ఉన్నారు.

ఇల్లందకుంట మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు ప్రజా ఆశీర్వాద సభకు తరలివెళ్లారు. ప్రతి గ్రామం నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, బైక్‌లపై బయలుదేరారు. సీఎం సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ సర్పంచులు రాజిరెడ్డి, రజితావాసుదేవరెడ్డి, మొగిలి, రాజు, దిలీప్‌రెడ్డి, వెంకటస్వామి, వనమాలావాసు, మానసామహేందర్, బీఆర్ఎస్ నాయకులు, తిరుపతిరెడ్డి, మల్లయ్య, ఎంపీటీసీలు ఎక్కటి సంజీవరెడ్డి, ఓదెలు, చిన్నరాయుడు, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్లు కందాల కొమురెల్లి, ఉడుత వీరస్వామి, మాజీ సర్పంచులు రమేశ్, కుమారస్వామి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

హుజూరాబాద్ మండలంలోని ప్రతి గ్రామం నుంచి స్వచ్ఛందంగా వేలాది మంది ట్రాక్టర్లు, ఆటోలు, డీసీఎం వ్యాన్, ద్విచక్రవాహనాల్లో జమ్మికుంటలో ప్రజాఆశీర్వాద సభకు తరలివెళ్లారు. ప్రతి గ్రామం నుంచి ప్రజలు తరలివెళ్లడానికి ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ గ్రామ కమిటీ సభ్యులు వాహనాలను ఏర్పాటు చేశారు.



వేదికపై మంత్రి గంగుల, పార్టీ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు



సభకు తరలివస్తున్న ప్రజలు

## సీఎం కేసీఆర్ సభ సైడ్‌లైట్స్

- 3.49గంటలకు సీఎం హెలిక్యాప్టర్‌లో జమ్మికుంటకు చేరుకుని, సభ ప్రాంగణంపై రౌండ్ వేశారు. హెలీక్యాప్టర్ తిరిగినంత సేపు ప్రజలు ఉత్సాహంగా చేతుల్లేపారు. ఈలలు, చప్పట్లు, చేతిలోని రుమాళ్లు తిప్పుతూ స్వాగతం పలికారు.
- 3.53గంటలకు చాపర్ నాయిని చెరువద్ద గల హెలీప్యాడ్‌లో ల్యాండ్ అయ్యింది.
- 4.03 గంటలకు సీఎం వేదికపైకి చేరుకున్నారు. ప్రజలకు అభివాదం చేశారు.
- 4.06 గంటలకు సీఎం ప్రసంగం ప్రారంభించారు. 4.25 గంటలకు తన ప్రసంగాన్ని ముగించారు.
- సీఎం 19నిమిషాలు మాట్లాడారు.
- చలోక్తులు, సామెతలతో ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించారు. కేసీఆర్ మాట్లాడినంత సేపు ప్రజల ఈలలు, చప్పట్లతో సభ ప్రాంగణం మార్మోగింది.
- 4.31గంటలకు హెలీప్యాడ్ వద్దకు చేరుకున్న కేసీఆర్, 4.35గంటలకు పరకాల సభకు బయలుదేదారు.
- రైతు బంధు కావాలా..? వద్దా.. అని కేసీఆర్ ప్రశ్నించగా.. జనాలు చేతులెత్తి ఉండాల్సిందేనని జవాబిచ్చారు.
- 3గంటలా..? 24గంటల కరెంటు కావాలా..? అని అడగగా.. ప్రజల నుంచి 24గంటల విద్యుత్ కావాలంటూ.. చక్కటి స్పందన వచ్చింది.
- మంది మాటలు విని.. ఎక్కడికోపోతే.. మళ్లచ్చే వరకు ఉన్నది పోయిందని.. కాంగ్రెస్, బీజేపీలనుద్దేశించి వ్యంగ్యంగా మాట్లాడటంతో సభా ప్రాంగణం చప్పట్లతో దద్దరిల్లింది.
- పాలిచ్చే బర్రెనిడిచి.. దున్నపోతుకు గడ్డేస్తే పాయిదా ఉంటదా.. ప్రజలే చెప్పాలని ఈటలనుద్దేశించి మాట్లాడారు. కౌశిక్‌నే గెలిపించాలని కోరారు.
- కత్తొగని చేతిలో పెట్టి.. యుద్ధమొకడిని చేయమంటే ఎలా..? రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం.. ఇక్కడ కౌశిక్‌ను గెలిపిస్తేనే సక్కగా పనులు సాగుతాయన్నారు.




సీఎం కేసీఆర్‌కు తిలకం దిద్దుతున్న జడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ





పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి, టీఎస్‌టీడీసీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్



సీఎం కేసీఆర్‌కు అందజేయడానికి జ్ఞాపికను తీసుకువస్తున్న హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, నాయకులు



సీఎం కేసీఆర్‌ను చూసేందుకు సభకు వచ్చిన వృద్ధులు



ఇల్లందకుంట: సిరిసేడు నుంచి జమ్మికుంట ప్రజా ఆశీర్వాద సభకు వెళ్తున్న ప్రజాప్రతినిధులు, ప్రజలు, నాయకులు